

మణుగూరులో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నేతలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



మణుగూరులో బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్తున్న పోలీసులు

# మోసకారి సర్కారు



మణుగూరులో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- **'రైతుభరోసా' పేరిట ముమ్మాటికీ మోసమే చేసింది..**
- **అప్పుడు ఎకరానికి రూ.15 వేలు అందిస్తామన్నారు..**
- **ఇప్పుడు మొత్తానికే ఎగనామం పెడుతున్నారు..**
- **గడిచిన 'వానకాలం' పంటల పెట్టుబడి సాయం ఇవ్వబోమంటున్నారు..**
- **'తుమ్మల' వ్యాఖ్యలపై భగ్గుమన్న రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు**
- **రెండు సీజన్ల సాయం రూ.15 వేలు ఒకేసారి ఇవ్వాలని డిమాండ్**
- **ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, ప్రదర్శనలు, రాస్తారోకోలు**
- **మణుగూరులో పోలీసుస్టేషన్‌కు బీఆర్ఎస్ నాయకుల తరలింపు**



ఇల్లెందులో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు

ఇల్లెందు/ టేకులపల్లి/ ముదిగొండ/ మధిర/ బోనకల్లు/ ఎర్రుపాలెం/ మణుగూరు టౌన్/ కూసుమంచి (నేలకొండపల్లి), అక్టోబర్ 20: అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు మోసకారితనం మరోసారి బయటపడిందంటూ రైతులు, బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. రైతుభరోసా పేరిట ముమ్మాటికీ మోసమే చేసిందని, మంత్రి తుమ్మల వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని తేల్చిచెప్పారు. వానకాలం రైతుభరోసా ఇవ్వబోమని, యాసంగిలో కూడా పంట వేసిన రైతులకే ఇస్తామని, అది కూడా సబ్ కమిటీ నివేదిక వచ్చాకే చెల్లిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలపై ఉమ్మడి ఖమ్మం జిల్లా అన్నదాతలు భగ్గుమన్నారు. ఇదే అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పలు మండలాల్లో ఆదివారం ఆందోళనలు నిర్వహించారు. మణుగూరులో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇల్లెందు, టేకులపల్లి మండలాల్లో జరిగిన ధర్నాల్లో మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇల్లెందు, టేకులపల్లి, ముదిగొండ, మధిర, బోనకల్లు, ఎర్రుపాలెం, మణుగూరు, నేలకొండపల్లి మండలాల్లో జరిగిన ఆందోళనల్లో బీఆర్ఎస్ నేతలు మాట్లాడారు. ఇప్పటికే రుణమాఫీ విషయంలో కర్షకులను వంచించిన కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు రైతుభరోసా విషయంలోనూ మరోసారి మోసం చేసిందని విమర్శించారు.

## రెండు సీజన్లవీ ఇవ్వాల్సిందే..

రాష్ట్రంలోని రేవంత్ సర్కారు హామీలను అమలు చేయకుండా అన్నదాతలకు నయవంచనకు గురిచేసిందని రైతులు, బీఆర్ఎస్ నాయకులు దుయ్యబట్టారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేల చొప్పున నిర్విరామంగా రైతుబంధు ఇచ్చిందని గుర్తుచేశారు. కానీ తాము అధికారంలోకి వస్తే ఎకరానికి రూ.15 వేలు ఇస్తామంటూ ప్రగల్బాలు పలికిన కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు మొత్తానికే ఇవ్వకుండా ఎగనామం పెడుతోందని ధ్వజమెత్తారు. గడచిన వానకాలం రైతుభరోసా ఇవ్వబోమంటే తాము ఊరుకోబోమని తేల్చిచెప్పారు. సబ్ కమిటీ నివేదిక వచ్చాకే యాసంగి సాయం అందిస్తామంటే సహించబోమని స్పష్టం చేశారు. గడిచిన వానకాలం, రాబోయే యాసంగి సీజన్లకు కలిపి రెండు విడతల పంటల సాయం కలిపి రూ.15 వేలను ఒకేసారి రైతుల ఖాతాల్లో జమ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు.

## హామీ ప్రకారం ఇవ్వాల్సిందే: హరిప్రియ

ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఎకరానికి రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఇవ్వాల్సిందేనని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్ డిమాండ్ చేశారు. రైతుల సాక్షిగా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని, మంత్రి తుమ్మల వ్యాఖ్యలే ఇందుకు సాక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు..

వానకాలం రైతుభరోసా పంటల సాయం ఇవ్వబోమంటూ మంత్రి తుమ్మల చేసిన వ్యాఖ్యలపై ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భగ్గుమన్నారు. ఎక్కడికక్కడ ఆందోళనలు, ధర్నాలు, రాసార్తోకోలు నిర్వహించారు. టేకులపల్లి బస్టాండ్ సెంటర్‌లో, ఇల్లెందు జగదాంబ సెంటర్‌లో, ముదిగొండ బస్టాండ్ సెంటర్‌లో, మధిర మండల కేంద్రంలో, ఎర్రుపాలెం మీనవోలు సెంటర్‌లో, బోనకల్లు ప్రొఫెసర్ జయశంకర్ ప్రాంగణంలో ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించారు. మణుగూరులో ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నేతలు బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని పీఎస్‌కు తరలించారు.



ఇల్లెందులో ప్రదర్శనగా వస్తున్న హరిప్రియ, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు



మధిరలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు



నేలకొండపల్లిలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

### సాయం అందక అప్పులపాలయ్యాం



గత కేసీఆర్ ప్రభుత్వం ఎనిమిదేళ్లపాటు పెట్టుబడి సాయం అందించింది. ఈ ఏడాది పెట్టుబడికి రైతుబంధు రాకపోవడంతో విత్తనాలు, ఎరువులు కొనేందుకు డబ్బు లేక చాలా ఇబ్బందులపాలయ్యాం. మమ్మల్ని కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులపాలు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మాకు ఒరిగిందేమీ లేదు, అన్నీ కష్టాలే.

**– పూనెం లింగమ్మ, చల్లసముద్రం, ఇల్లెందు మండలం**

### ప్రభుత్వం మోసగించింది



గత కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు పథకం కింద ఏడాదికి రెండు విడతలుగా ఎకరానికి రూ.10 వేల పెట్టుబడి సాయం అందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతు భరోసా పేరుతో ఎకరానికి సంవత్సరానికి రూ.15 వేలు ఇస్తామన్నారు. ఇప్పటివరకూ రూపాయి ఇచ్చింది లేదు. వానకాలం పోయినా రైతుభరోసా లేదు. రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసగించింది.

**– అజ్మీరా కవిత, పోలవరం, ఇల్లెందు మండలం**



టేకులపల్లిలో జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్



ముదిగొండలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



ఎర్రుపాలెం మెయిన్ రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, రైతులు

# దీపావళి నుంచి నిరుపేదలకు ఇళ్లు

- **నూతన కాలనీలు, విలీన గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం**
- **ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలి**
- **ఖమ్మం పర్యటనలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, అక్టోబర్ 20: దీపావళి నుంచి నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం నగరంలో నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలు, విలీన గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం కల్పిస్తూ చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఖమ్మం నగరంలో ఆదివారం పర్యటించిన ఆయన.. 16వ డివిజన్ శ్రీరాంనగర్ రోడ్డు నంబర్ 13లో రూ.1.95 కోట్ల టీయూఎఫ్ ఐడీసీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ.. నగరంలో ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉంటే దోమలతో ఇరుగుపొరుగూ వారు ఇబ్బందులు పడుతుంటారని అన్నారు. అందుకని ఆయా స్థలాల యజమానులతో చర్చించి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, యజమానులు పట్టించుకోకుంటే నోటీసులు జారీ చేయాలని కేఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు. ఇటీవలి మున్నేరు వరదల్లోని కొందరు ముంపు బాధితులకు ఇప్పటి వరకు పరిహారం అందలేదంటూ దరఖాస్తులు వచ్చాయని అన్నారు. నిజంగా పేదలు ముంపునకు గురై ఉంటే సర్వే చేసి పరిహారం అందజేస్తామని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, పేదలు సంతోషంగా ఇందిరమ్మ ఇళ్లలో ఉండేలా చూస్తామని అన్నారు. అనంతరం కేఎంసీ కమిషనర్ అభిషేక్ మాట్లాడుతూ.. శంకుస్థాపన చేసిన పనులను రెండు రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. 16వ డివిజన్‌లో దాదాపుగా 1,500 కుటుంబాలకు వరద పరిహారం అందించామని, వరదల కారణంగా నష్టపోయిన ప్రతి కుటుంబానికీ సహాయం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్డీవో గణేశ్, కార్పొరేటర్ మోడారపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### 'తుమ్మల' నోట అబద్ధాలు..

అయితే, ఈ సభలో గత ప్రభుత్వంపై విమర్శలు చేసే క్రమంలో మంత్రి తుమ్మల పలు అబద్ధాలు ప్రస్తావించారు. గత కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో కొనసాగిన గడిచిన పదేళ్లలో కచ్చితంగా పంటల సీజన్‌కు ముందుగానే పంటల పెట్టుబడి కోసం రైతుబంధును అందించినప్పటికీ.. 'గత ప్రభుత్వం ఎగ్గొట్టిన రైతుబంధును మొన్న మేం చెల్లించాం' అంటూ అబద్ధాలు మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమాన్ని విస్మరించి ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తోందంటూ ఆరోపించారు. తమ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ రుణమాఫీ చేస్తున్నారంటూ చెప్పుకొచ్చారు. తమ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రూ.50 వేల కోట్లు ఖర్చు చేస్తున్నదని అన్నారు. గత ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదంటూ ఆరోపణలు చేశారు.

# ప్రతీ సమస్యకు ఓ పరిష్కారం

- **మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలి**
- **పోలీస్ అధికారులు, సిబ్బందితో ఎస్పీ రోహిత్ రాజు**







బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు, అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 20: 'ప్రతీ సమస్యకు ఓ పరిష్కారం ఉంటుంది. దానిని పట్టుకునేందుకు మార్గం తప్పనిసరిగా లభిస్తుంది' అని ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు పేర్కొన్నారు. ఇటీవల జిల్లా పోలీస్ శాఖలో ఎదురవుతున్న పరిస్థితుల నేపథ్యంలో 'స్ట్రెస్ మేనేజ్‌మెంట్ ఇన్ పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్' అంశంపై కొత్తగూడెం సబ్ డివిజన్‌లోని అధికారులకు, సిబ్బందికి ఆదివారం అవగాహన కల్పించారు. కొత్తగూడెంలోని పీఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటైన ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ అధికారులు, సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. సమస్య ఎంత పెద్దదైనా సరే.. దానిని పరిష్కరించుకునేందుకు చాలా మార్గాలు ఉంటాయని, వాటిని ఉపయోగించుకుని ముందుకు సాగాలని సూచించారు. విధి నిర్వహణలో భాగంగా ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. చిన్న సమస్యలకే ఒత్తిడిని పెంచుకోవద్దని, అనవసరంగా ఆరోగ్య సమస్యలను తెచ్చుకోవద్దని సూచించారు. పనులను వాయిదా వేయకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేసుకుంటే ఒత్తిడి పెరిగే అవకాశం ఉండదని అన్నారు. శారీరకంగా దృఢంగా ఉండేందుకు రోజూ వ్యాయామం చేయాలని కోరారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు జవ్వాది వెంకటేశ్వరరావు, కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్, చుంచుపల్లి సీఐ రాయల వెంకటేశ్వర్లు, కొత్తగూడెం త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కాగితోజు శివప్రసాద్, వన్ టౌన్ ఎస్సై విజయ, లక్ష్మీదేవిపల్లి ఎస్సై గన్‌రెడ్డి రమణారెడ్డి, చుంచుపల్లి ఎస్సై రవికుమార్, సుజాతనగర్ ఎస్సై జుబేదా, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సండ్ర ఇంట రిసెప్షన్ సందడి


**నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రముఖులు**
**హాజరైన వద్దిరాజు, తాతా మధు, నామా, తుమ్మల**



నవదంపతులను ఆశీర్వదిస్తున్న వద్దిరాజు రవిచంద్ర, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర

**సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఇంట్లో రిసెప్షన్ సందడి నెలకొంది. సండ్ర కుమారుడు భార్గవ్ - చిద్విత సాయిల వివాహం ఇటీవల హైదరాబాద్‌లో జరుగగా.. ఖమ్మంలోని శ్రీలక్ష్మి గార్డెన్స్‌లో ఆదివారం రిసెప్షన్ నిర్వహించారు. ఈ వేడుకకు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకుడు ఆర్‌జేసీ కృష్ణ, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితర ప్రముఖులు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు.**

**–రఘునాథపాలెం, అక్టోబర్ 20**



నవదంపతులను ఆశీర్వదించి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఖమ్మం మాజీ ఎంపీ నామా



నూతన దంపతులతో ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్ఎస్ నాయకుడు ఆర్‌జేసీ కృష్ణ